క్లుప్తంగా

కలెక్టర్ దృష్టికి ప్రజా సమస్యలు



జిల్లా కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: మండలానికి చెందిన పలు సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో జిల్లా కలెక్టర్‌కు స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు నివేదించారు. ఇందులో ముఖ్యంగా 2023–24 సంవత్సరంలో కంచిలి మండల పరిధిలో వరి పంట వర్షాలు లేక ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, గత జూలైలో మంజూరైన నష్టపరిహారం ఇంతవరకు రైతులకు అందలేదని, దీన్ని వెంటనే మంజూరు చేయాలని కోరారు. అలాగే కంచిలి పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న సబ్ ఆర్డినేటర్ పోస్టును భర్తీ చేయాలని, ఆస్పత్రి అభివృద్ధి నిధులు రూ. 5 లక్షల వరకు పెంచాలని కోరారు. ఏఐఐబీ నిధులతో మంజూరైన 22 రోడ్ల పనులను కూడా పూర్తి చేస్తామని కలెక్టర్ చెప్పినట్లు ఎంపీపీ తెలిపారు.

లాలాపేట దర్గా నూతన కార్యవర్గం



నూతన కమిటీ సభ్యులు

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని హజరత్ యూసుఫ్‌షా టకియా లాలాపేట దర్గా నూతన కార్యవర్గం మంగళవారం ఏర్పాటైంది. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ సాదిక్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షునిగా ఎండీ ఫరీదుద్దీన్, ఉపాధ్యక్షునిగా అబ్దుల్లా, సెక్రటరీగా ఎస్.ఆలీ, ట్రెజరర్‌గా తాజ్‌ఖాన్, సభ్యులుగా ఆక్తర్‌ఖాన్, అలీమ్‌ఖాన్, ఇర్ఫాన్, జాకీర్, ఉస్మాన్, రఫీ ఎన్నికయ్యారు.

భక్తిశ్రద్ధలతో విశ్వశాంతి మహాయజ్ఞం



అన్నసంతర్పణలో భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో సీతారామాలయం పునః ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా నిర్వహిస్తున్న విశ్వశాంతి మహా యజ్ఞం మంగళవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు యజ్ఞాన్ని సందర్శిస్తున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

రీసర్వేపై చైతన్య ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కవిటి: సమగ్ర భూ రీసర్వేపై అవగాహన ర్యాలీని డిగొనపపుట్టుగ గ్రామంలో రెవెన్యూ అధికారులు మంగళవారం నిర్వహించారు. అంతకుముందు గ్రామసచివాలయం వద్ద కార్యక్రమం ప్రాధాన్యతను రైతులకు వివరించారు. తహసీల్దార్ బి.మురళీమోహనరావు మాట్లాడుతూ.. రీసర్వేతో భూ సమస్యలను పరిష్కరించవచ్చునన్నారు. ర్యాలీలో సర్పంచ్ బెందాళం కిరణకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు చందాన పూర్ణ, జల్లు యుగంధర్, మండల సర్వేయర్ మల్లికార్జునపాణిగ్రాహి, ఆర్‌ఐ కె.రమణమూర్తి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఆదిత్య విద్యార్థుల ఎంపిక

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు గెట్‌మీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంబీఏ, బీటెక్ కోర్సులకు చెందిన 11 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌ఓడీలు ఎం.ఎస్.వి.సంతోష్‌కుమార్ విద్యార్థులను అభినందించారు.

రక్షకభటుల నివాసాలకు .. రక్షణ కరువు!

- శిథిలావస్థలో పోలీసు క్వార్టర్స్
- కవిటిలో నిరుపయోగంగా మిగిలిన వైనం



శిథిలావస్థలో ఎస్సై క్వార్టర్



నిరుపయోగంగా ఉన్న పోలీసు కుటుంబాల ఇళ్లు

కవిటి: ప్రజలకు అన్నివేళలా రక్షణ కల్పించాల్సిన రక్షకభటుల నివాస సముదాయం శిథిలావస్థకు చేరుకుంది. వీటిని వినియోగంలోకి తీసుకురావాల్సిన ప్రభుత్వాలు, సంబంధిత శాఖ అధికారులు కనీసం పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. మండలాల వ్యవస్థ ఏర్పడిన తొలినాళ్లలో అద్దె భవనంలో కవిటి పోలీస్ స్టేషన్ కార్యాలయం ఉండేది. ఆ తరువాత ఎస్‌కేఈ రోడ్డు పక్కన మూడున్నర దశాబ్దాల క్రితం పక్కా భవనాన్ని నిర్మించారు. ఆ సమయంలో 28 పోస్టులను మంజూరు చేశారు. వీరిలో ఎస్సై, ముగ్గురు ఏఎస్సైలు, ఆరుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 18 మంది కానిస్టేబుళ్లు ఉండేవారు. వీరి కోసం స్టేషన్‌కు సమీపంలోనే క్వార్టర్లను నిర్మించారు. దీంతో పోలీసు కుటుంబాలన్నీ ఇక్కడ హాయిగా నివాసం ఉండేవి. కొన్నేళ్ల తరువాత ఇళ్లన్నీ వర్షానికి కారిపోవడం ప్రారంభమయ్యాయి. అయినప్పటికీ దీనిపై ఎవరూ దృష్టి కేంద్రీకరించలేదు. ఎటువంటి మెయింటెనెన్స్ చేయని కారణంగా ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో అప్పటి వరకూ ఇక్కడ నివాసం ఉండే కుటుంబాలు ఖాళీ చేసేశాయి. వర్షానికి కారిపోవడం, కాంపౌండ్ లేకపోవడం, కొబ్బరితోటలకు సమీపంలో క్వార్టర్స్ ఉన్న కారణంగా పాములు, ఇతర విషకీటకాలు సంచరిస్తుండడంతో వీటిలో ఉండేందుకు ఏ పోలీసు కుటుంబం కూడా ఇష్టపడడం లేదు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న 22 పోలీసు కుటుంబాలు కవిటి మండల కేంద్రం, సమీప గ్రామాల్లో అద్దె ఇళ్లలో ఉంటున్నారు. దీంతో విలువైన క్వార్టర్ ప్రస్తుతం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఇళ్లన్నీ మరింత శిథిలావస్థకు చేరుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి శిథిలావస్థకు చేరుతున్న పోలీసు సిబ్బంది ఇళ్లకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది. ఇలా చేస్తే సిబ్బంది కూడా స్థానికంగా అందుబాటులో ఉంటారని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతా



కవిటి మండల పోలీసు క్వార్టర్స్ పరిస్థితిని పరిశీలిస్తాను. వాస్తవ స్థితిగతులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాను. వారి ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

–మీసాల చిన్నంనాయుడు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఇచ్ఛాపురం

ఘనంగా ఆలయ ప్రతిష్ఠ



కంచిలి మండలంలోని జె.భైరిపురం పంచాయతీ పరిధి ఘాటీముకుందాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

–కంచిలి

అలరించిన చిన్నారులు



ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన శ్రీవెంకటేశ్వర డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ చిన్నారులు ప్రశంసలు అందుకున్నారు. శ్రీరామనవమి వసంత నవరాత్రి వేడుకల్లో భాగంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్‌పూర్ పట్టణంలో అన్నపూర్ణ తెలుగు సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి, భరతనాట్యం, జానపద, సంబల్‌పూరియా నాట్యపోటీల్లో విశేష ప్రతిభ కనబర్చారు. దీంతో నిర్వాహకులు చిన్నారులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

–ఇచ్ఛాపురం

కూలేందుకు సిద్ధంగా..



టెక్కలి మండలం పెద్దసాన–కండికపేట గ్రామాల మధ్యలో వంశధార ఎడమ ప్రధాన కాలువ గట్టుపై విద్యుత్ స్తంభం కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. గట్టుపై స్తంభాలు వేసే సమయంలో నాణ్యతతో పనులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం పక్కకు ఒరిగిపోయి కూలిపోయే పరిస్థితిలో ఉన్నాయి. గట్టిగా వర్షాలు పడితే చాలా స్తంభాలు పడిపోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు మేల్కొని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

–టెక్కలి

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం



సంతబొమ్మాళి మండల నాయకులతో తిలక్

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి తిలక్

టెక్కలి: కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. అలాగే మంత్రి అచ్చెన్నాయుడు అండతో రెచ్చిపోతున్న టీడీపీ నాయకుల కక్ష పూరిత చర్యలను కలిసికట్టుగా ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. సంతబొమ్మాళి మండలానికి చెందిన పార్టీ నూతన కమిటీ నాయకులతో టెక్కలిలోని కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పాలన పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు దళితులు, సామాన్య ప్రజలపై కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇటువంటి కుట్రలను ఎదుర్కొంటూ ప్రజలకు మద్దతుగా పోరాటాలు చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బి.మోహన్‌రెడ్డి, నాయకులు ఎన్.భీమారావు, వై.మన్మథరావు, ఎస్.వెంకటేష్, ఎం.నరసింగరావు, ఎ.మల్లేష్, టి.నారాయణ, జె.రాంబాబు, పి.రామయ్య, ఎన్.రామారావు, నరేష్, పి.కామరాజు, యు.లోకనాథం, పి.లక్ష్మణరావు, ఎస్.రాజారావు పాల్గొన్నారు.

‘గోపాల సాగరాన్ని మినీ రిజర్వాయర్‌గా మార్చాలి’



గోపాల సాగరాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘాల ప్రతినిధులు

మందస: మందస మహేంద్రగిరి నీటిని అంబుగైరి నుంచి గోపాల సాగరానికి మళ్లించడంతోపాటు దీన్ని మినీ రిజర్వాయర్‌గా మార్చాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధులు కోరారు. గోపాల సాగరం, చీపి నుంచి సాబ కోట వరకూ ఉన్న గెడ్డలు, కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహేంద్రగిరుల నుంచి నిత్యం ప్రవహిస్తున్న నీరు నిరుపయోగంగా సముద్రంలో కలిసిపోతోందన్నారు. ఆ నీటిని సాబకోట వద్ద ఉన్న అంబుగైరికి దిగువున రాజపురం పైన చెక్‌డ్యాం నిర్మించి బుడంబో, కారిగం మీదగ బుడిగాటి నుంచి కాలువ తవ్వి మందసలోని గోపాల సాగరానికి మళ్లించాలని అన్నారు. వృథాగా పోతున్న నీటిని సాగు భూములకు మళ్లిస్తే సుమారు 20 గ్రామాల్లోని ఆరు వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చన్నారు. గిరిజన గ్రామాలైన బలియాసాయి నుంచి మేఘమాల వరకు పల్లపు గ్రామాలైన మందస, బైరిసారంగపురం, టి.శాశనం తదితర గ్రామాల భూములకు సాగు నీటిని అందించవచ్చునన్నారు. పరిశీలనలో జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, మండల కార్యాదర్శి మట్ట ధర్మారావు, వడ్డీ గోపాలకృష్ణ, గణేష్ సాహు, పలువురు రైతులు ఉన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

- మున్సిపల్ సమావేశంలో చైర్మన్ గిరిబాబు



చైర్మన్ గిరిబాబుకు వినతిపత్రం అంజేస్తున్న కౌన్సిలర్ బృందావతి, కో–ఆప్షన్ సభ్యుడు సంతోష్

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 31వార్డుల్లో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్ బి.గిరిబాబు చెప్పారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్దానం ప్రాజెక్టు నుంచి మున్సిపాలిటీకి మూడు ఎంఎల్‌డీ నీరు అందించడానికి సమ్మతి తెలిపారన్నారు. దీనికి కోసం రూ.63.50 లక్షలతో పైపులైన్ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడిచారు. అయితే ప్రస్తుతానికి వేసవి రీత్యా ఐదు ట్యాంకర్లతో రోజుకు 22 ట్రిప్పులు నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నామన్నారు. నీటి సరఫరా వివరాలు పూర్తిగా వెల్లడించాలని కౌన్సిలర్ దుర్గాశంకర్ పండా కోరగా.. దీని చైర్మన్ గిరిబాబు అడ్డుచెప్పడంతో ఇరువురు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

గ్రావెల్ తవ్వకాలు ఆపాలి

19వవార్డు సూదికొండ పరిధిలో ప్రజా ఆమోదం, కౌన్సిల్ తీర్మానం, కలెక్టర్ అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారని.. తక్షణమే నిలిపి వేయాలని ఆ వార్డు కౌన్సిలర్ శిష్టు బృందావతి, కో–ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ సమావేశంలో ప్రస్తావించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ చైర్మన్ గిరిబాబుకు వినతి పత్రం అందజేశారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు బోర క్రిష్ణారావు, మీసాల సురేష్, కమిషనర్ నడిపేన రామారావు, కౌన్సిలర్లు దున్న నిర్మల, బల్ల శ్రీను, పిచ్చుకల అజయ్, సనపల సింహాచలం, బెల్లాల శ్రీనివాస్, సవర సోమేష్ పాల్గొన్నారు.

రైల్వే గేటు దగ్గర గోతులతో అవస్థలు

టెక్కలి: టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో రైల్వే గేటు వద్ద ట్రాక్‌కు ఇరువైపులా గోతులు ఏర్పడడంతో ఇబ్బందులు పడుతున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. రైలు వచ్చే పోయే సమయంలో గేటు తీసిన తరువాత ఇరువైపులా రాకపోకలు సాగించే వాహనచోదకులు ఈ గోతులతో ట్రాక్ దాటలేకపోతున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని కోరుతున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా వాటికి దూరంలో ఉండాలని ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న ప్రధానోపాధ్యాయులు నరేంద్రనాథ్ పట్నాయక్ అన్నారు. మంగళవారం కొళిగాం ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలు– అనర్థాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వలన కలిగే దుష్ఫలితాలను ప్ల కార్డుల ద్వారా ప్రదర్శించి ఈగల్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ కో ఆర్డినేటర్లు జ్యోతి, శ్రీనివాస్, సభ్యులు మారుతి బెహరా, అనూష నాయక్, కృష్ణ, ఆదిత్య, తపస్య, యశాస్విని, అమ్రిత ఉన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

టెక్కలి రూరల్: స్థానిక ఎన్టీఆర్ కాలనీ 11వ లైన్‌లో నివాసం ఉంటున్న పెయింటర్ మట్ట సంతోష్ ఇటీవల గాయపడి ఇంటికే పరిమితమయ్యాడు. దీంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులకు గురౌతున్న విషయం తెలుసుకున్న టెక్కలి తూర్పుకాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. నిత్యావసర సరుకులతోపాటు కొంత నగదను మంగళవారం అందజేశారు. ప్రముఖ ఎముకల వైద్యుడు డాక్టర్ రెడ్డి చిన్ననాయుడుతో వైద్య సేవలు అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పోలాకి వాసుదేవ్, సభ్యులు గొర్త శంకర్, దివాకర్, తమిరి బలరాం, రౌతు జయమోహన్, జగన్నాథరావు ఉన్నారు.

అధికారుల దృష్టికి నియోజకవర్గ సమస్యలు

టెక్కలి: జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో భాగంగా టెక్కలి జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి, ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ, సంతబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి తదితరులు ఆయా మండలాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. మూలపేట పోర్టు నిర్మాణంలో భాగంగా తాత్కాలికంగా నిర్మాణం చేసిన వంతెనల వలన వర్షాకాలంలో వరద నీరు ప్రవాహం లేక సుమారు పది వేల ఎకరాలకు ముంపు ప్రమాదం ఉందని, అలాగే ప్రస్తుతం నష్టాల్లో ఉన్న ఆక్వా రైతులకు విద్యుత్ బిల్లులు వేల రూపాయల్లో మరింత భారంగా వస్తున్నాయని, నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాత్రి వేళల్లో వైద్య సిబ్బంది ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు వసంతరెడ్డి విన్నవించారు. టెక్కలి మండలంలో ప్రజాప్రతినిధులు తీర్మానం చేసిన అభివృద్ధి పనులు చేపట్టాలని, వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని, ప్రజాప్రతినిధులు గతంలో చేపట్టిన పనులకు సంబంధించి చెల్లించిన డబ్బులు ఇవ్వాలని జెడ్పీటీసీ, ఎంపీపీలు దువ్వాడ వాణి, ఆట్ల సరోజనమ్మ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోండి

నందిగాం: మండలంలో కొత్తగా ఏర్పాటు చేసిన మూడు ఆధార్ కేంద్రాలను ఆయా సచివాయల పరిధివారు వినియోగించుకోవాలని ఎంపీడీఓ రాజారావు సూచించారు. నౌగాం, దేవుపురం, కొత్తగ్రహారం సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

నేత్రపర్వంగా శ్రీరామ పట్టాభిషేకం



బొరివంకలో శ్రీరామ పట్టాభిషేకాన్ని తిలకిస్తున్న మహిళలు

కవిటి: రాజపురం సీతారామ ఆలయం, ఆర్.భైరిపురం సీతారామాలయం, బొరివంక గ్రామం హాస్టల్ వీధిలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాన్ని మంగళవారం నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు. శ్రీరామ కల్యాణం, పట్టాభిషేకం ఉత్సవాలను భద్రాచలం రామాలయంలో నిర్వహించే విధంగా ఈ గ్రామాల్లో నిర్వహించడం ఆనవాయితీ. బొరివంకలో భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

రెంటికోటలో ఆధార్ ఇక్కట్లు!

పలాస: రెంటికోట గ్రామ సచివాలయంలో కొన్ని రోజులుగా ఆధార్‌కార్డుల్లో పేర్లు చేర్పులు, మార్పులు, కొత్తగా నమోదు వంటి వాటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ సేవల కోసం సచివాలయానికి ఎప్పుడు వెళ్లినా కంప్యూటరు బాగోలేదని చెప్పి సిబ్బంది పంపించేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. డిజిటల్ అసిస్టెంటు ఉన్నా ఏదో నెపంతో చేయడం లేదంటున్నారు. ఎంపీడీవో కె.వసంతకుమార్ వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించగా.. రెంటికోటలో ఆధార్ కేంద్రం పనిచేస్తున్నప్పటికీ డిజిటల్ అసిస్టెంట్ వేరే పనుల్లో ఉండటం వల్ల ఇబ్బందులు తలెత్తిఉండవచ్చునని సందేహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పారదర్శకంగా రెవెన్యూ సేవలు



ఎంఎల్‌ఎస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

కంచిలి: ప్రజలకు పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందించాలని మండల తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ అన్నారు. రెవెన్యూ సిబ్బందితో తన కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నీటిపన్ను వసూలు, నాలా ట్యాక్స్ వసూలు , హౌసింగ్, పొజిషన్ సర్టిఫికెట్ల పంపిణీపై సమీక్షించారు. అంతకు ముందు స్థానిక ఎంఎల్‌ఎస్ కేంద్రాన్ని పరిశీలించారు. గొడౌన్ డీటీ పానీ, ఆర్‌ఐ క్రిష్ణచంద్ర రౌళో ఉన్నారు

జగనన్న కాలనీ లేఅవుట్ పరిశీలన



లే అవుట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకటేష్ తదితరులు

నందిగాం: లట్టిగాం పరిధిలోని జగనన్న కాలనీ లేఅవుట్‌ను పలాస ఆర్డీవో జి.వెంకటేష్ మంగళవారం పరిశీలించారు. హైవేకు సమీపంలోని లేఅవుట్ పరిధిలో ఎన్ని ఇంటి స్థలాలు ఇచ్చారు, ఎన్ని నిర్మాణాలు చేపట్టారో వివరాలను డీటీ రామారావు, మండల సర్వేయర్ హనుమంతురావును అడిగి తెలుసుకున్నారు. నర్సిపురం పంచాయతీ కోమటూరు పరిధిలో ఉన్న స్థలం, చెరువు 22ఏ ప్రభుత్వ నిషేధ స్థలం ఉందని పరిశీలించి న్యాయం చేయాలనే స్థానికుల ఫిర్యాదు మేరకు ఆర్డీవో పరిశీలించారు. ఆర్‌ఐ సింహాచలం, సర్వేయర్లు రామారావు ఉన్నారు.